RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 81 | ఏప్రిల్ 10 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 81 | April 10 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క: గిట్టుబాటు ధరపై రైతులకు భరోసా 2

# పొంగులేటి కాదు.. పొంగులూటీ

### మంత్రి పొంగులేటి బాంబులన్నీ 'తుస్సు'మన్నాయి: హరీశ్ రావు ఘాటు విమర్శలు

**వనపర్తి జనసంఘర్షణ :**
రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో గొల్లపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పొంగులేటిని 'పొంగులేటి' కాదు, 'పొంగులూటీ' అని.. ఆయన పేల్చేవి బాంబులు కాదు 'తుస్సు బాంబులు' అని ఎద్దేవా చేశారు.

సచివాలయం వంటి పవిత్రమైన చోట కూర్చుని పొంగులేటి అబద్ధాలు మాట్లాడుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్‌లో జరిగిన అక్రమాలను సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అసెంబ్లీలో బయటపెట్టారని గుర్తు చేశారు. ఆ సంస్థకు అనుమతులు లేవని అధికారులు నివేదికలు ఇచ్చినా, ఇప్పుడు వాటిని మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం చెప్పింది తప్పా లేక మంత్రి చెబుతున్నది తప్పా అని ఆయన ప్రశ్నించారు. నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ నీతి అవలంబిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆ భూములను 22ఏ నిబంధన కింద



రక్షించామని, ఇప్పుడు అవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టు చెబుతున్నా.. అక్కడ ఆక్రమణలు ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. "అవి ప్రభుత్వ భూములైతే

➢ మిగతా 2వ పేజీలో..

# ఇంటర్ ఫలితాలపై వదంతులు నమ్మవద్దు

### స్పష్టం చేసిన తెలంగాణ విద్యాశాఖ

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల విడుదలపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని విద్యాశాఖ తీవ్రంగా ఖండించింది. ఫలితాల ప్రకటనలో జాప్యం జరుగుతుందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. ఫలితాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని అధికారులు వెల్లడించారు. ఫలితాల విడుదలపై స్పష్టతనిస్తూ తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం గత పదేళ్లలో ఫలితాలు విడుదలైన తేదీలను వెల్లడించింది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ రెండో వారం నుంచి మే మాసం మధ్యలో విడుదలవుతుంటాయని గుర్తు చేసింది.

2017లో ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2023లో మే 9న, 2024లో ఏప్రిల్ 24న ఫలితాలు ప్రకటించారు. గతేడాది (2025) ఏప్రిల్ 22న ఫలితాలు వెలువడ్డాయి. ఈ క్రమబద్ధమైన విశ్లేషణను బట్టి ఏప్రిల్ మొదటి వారంలోనే ఫలితాలు రావాలని ఎక్కడా లేదని ప్రభుత్వం

➢ మిగతా 2వ పేజీలో..

# ముగిసిన మూడు రాష్ట్రాల అసెంబ్లీ పోలింగ్

### భారీగా ఓటు వేసిన ఓటర్లు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అస్సాం, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర ఎన్నికల సంఘం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో ఓటింగ్ సజావుగా సాగింది.



ఉదయం నుంచే ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి మూడు ప్రాంతాల్లోనూ గత ఎన్నికల కంటే మెరుగైన పోలింగ్ శాతం నమోదవ్వడం విశేషం.

➢ మిగతా 2వ పేజీలో..

# తెలంగాణలో భానుడి భగభగలు

### ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. మార్చి నెల ముగియకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 2 నుండి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం మరియు మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనుండటంతో ఆ జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. మిగిలిన అన్ని జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బుధవారం నాటి గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 20



జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల మార్కును దాటాయి. ఖమ్మం జిల్లా

➢ మిగతా 2వ పేజీలో..

# పాకిస్థాన్‌ను నమ్మలేం

### ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అమెరికా మరియు ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చల ప్రక్రియలో మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్‌పై తమకు ఎలాంటి నమ్మకం లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా తన స్వప్రయోజనాల కోసమే పాకిస్థాన్‌ను ఈ ఒప్పందంలో భాగస్వామిని చేసిందని తాము భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాంతి చర్చల్లో పాక్ పాత్రను ఇజ్రాయెల్ ఏమాత్రం విశ్వసించడం లేదని అజార్ కుండబద్దలు కొట్టారు. అయినప్పటికీ, ఇరాన్ విషయంలో తమ వ్యూహాత్మక లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా-ఇరాన్ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తున్నప్పటికీ, ఇది కేవలం ఇరాన్‌కు మాత్రమే పరిమితమని అజార్ స్పష్టం చేశారు. లెబనాన్‌పై తాము చేపట్టిన

➢ మిగతా 2వ పేజీలో..

# జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

### సెల్ఫీ సరదా తెచ్చిన చేటు

**అల్లూరి జిల్లా జనసంఘర్షణ :**
సరదాగా ఫోటోలు దిగాలన్న ఆరాటం ముగ్గురు యువతుల ప్రాణాలను బలితీసుకుంది. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ పరిధిలోని మల్లంగుమి (మూలగుమ్మి) జలపాతం వద్ద జరిగిన ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16), మరియు అంజలి అనే నలుగురు యువతులు ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి చేసుకున్నారు. సెలవుల్లో విహారయాత్రలో భాగంగా వీరంతా మల్లంగుమి జలపాతాన్ని సందర్శించారు. జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు నలుగురూ నీటిలో పడిపోయారు. ముగ్గురు మృతి.. ఒకరి పరిస్థితి విషమం: ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే త్రిష, రత్నకుమారి, పవిత్ర మృతి చెందారు.

➢ మిగతా 2వ పేజీలో..

# నెతన్యాహుపై సొంత దేశంలోనే విమర్శల వెల్లువ

### కాల్పుల విరమణ ఒప్పందం ఒక 'రాజకీయ వైఫల్యం'

**టెల్‌అవీవ్ జనసంఘర్షణ**
ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు స్వదేశంలో గట్టి ఎదురుదెబ్బగా మారింది. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇక్కడి ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ ఈ ఒప్పందాన్ని ఒక 'రాజకీయ విపత్తు'గా అభివర్ణించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అహంకారం, నిర్లక్ష్యం మరియు సరైన వ్యూహరచన లేకపోవడం వల్ల ఇజ్రాయెల్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన ఆక్షేపించారు. నెతన్యాహు తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టాయని, ఆయన వల్ల కలిగిన వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చుకోవడానికి సంవత్సరాల సమయం పడుతుందని లాపిడ్ సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. సైన్యం తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ, రాజకీయ నాయకత్వం మాత్రం దానికి తగ్గ ఫలితాలను సాధించలేకపోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని

➢ మిగతా 2వ పేజీలో..

## పొంగులేటి కాదు.. పొంగులూటీ

**మొదటిపేజీ తరువాయి..** ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కేవలం పేదల ఇళ్లను కూల్చడానికే హైడ్రా పరిమితమా?" అని ఆయన ప్రశ్నించారు. అక్కడ ఉన్న అక్రమ కట్టడాలను కూల్చి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాంబులు పేలుతాయని చెప్పి ఏడాది దాటినా ఏమీ జరగలేదని, సరుకు లేకనే ఆయన తిట్ల దండకం అందుకుంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. తనతో పాటు తోటి మంత్రుల అవినీతి చిట్టాను కూడా పొంగులేటి పరోక్షంగా బయటపెట్టారని ఎద్దేవా చేశారు. రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి, సొంత లాభం కోసం చూస్తున్న ఈ ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

## తెలంగాణలో భానుడి భగభగలు

**మొదటిపేజీ తరువాయి..** తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5 డిగ్రీలు, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాజధాని హైదరాబాద్‌లో సైతం ఎండ తీవ్రత పెరుగుతూ 38 డిగ్రీలకు చేరుకుంది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావం వల్ల వచ్చే వారం రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని, దీనివల్ల వడగాలుల ప్రభావం కూడా పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు వివరించారు.

ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో మధ్యాహ్నం వేళల్లో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండలు మరియు వడగాలుల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు వెళ్లే సమయంలో గొడుగులు వాడాలని, తగినంత నీరు తాగుతూ హైడ్రేటెడ్ గా ఉండాలని కోరింది. గతేడదితో పోలిస్తే ఈసారి ఏప్రిల్ లోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

## ఇంటర్ ఫలితాలపై వదంతులు నమ్మవద్దు

**మొదటిపేజీ తరువాయి..** వివరించింది. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడానికి పట్టే సమయాన్ని బట్టి ప్రతి ఏటా తేదీల్లో స్వల్ప మార్పులు ఉంటాయని తెలిపింది. ప్రస్తుతం మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతోందని, అది పూర్తికాగానే అధికారికంగా ఫలితాల తేదీని ప్రకటిస్తామని విద్యాశాఖ తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను నమ్మవద్దని, కేవలం బోర్డు ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించింది.

## ముగిసిన మూడు రాష్ట్రాల అసెంబ్లీ పోలింగ్

**మొదటిపేజీ తరువాయి..** సాయంత్రం 5 గంటల సమయానికి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుదుచ్చేరిలో అత్యధికంగా 86.92 శాతం, అస్సాంలో 84.42 శాతం, కేరళలో 75.01 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77 శాతం ఓటింగ్ జరిగింది. అస్సాంలోని 126 నియోజకవర్గాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనగా, దల్‌గావ్‌లో రికార్డు స్థాయిలో 94.57 శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోని 30 స్థానాల్లోనూ ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ, క్యూలైన్లలో ఉన్న వారికి టోకెన్లు జారీ చేసి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, తమిళనాడులోని అన్ని స్థానాలకు మరియు పశ్చిమ బెంగాల్ మొదటి విడత ఎన్నికలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. బెంగాల్‌లో రెండో విడత ఏప్రిల్ 29న నిర్వహించనున్నారు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి. అంతవరకు అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉండనుంది.

## జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

**మొదటిపేజీ తరువాయి..** అంజలి అనే మరో యువతిని ప్రాణాలతో కాపాడిన స్థానికులు, ఆమెను చికిత్స నిమిత్తం అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువతులు మృత్యువాత పడటంతో జుంబువలస గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమ కళ్లముందే ఎదిగిన పిల్లలు ఇలా అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సెల్ఫీలు తీసుకునేటప్పుడు ప్రమాదకర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు మరోసారి హెచ్చరిస్తున్నారు.

## నెతన్యాహుపై సొంత దేశంలోనే విమర్శల వెల్లువ

**మొదటిపేజీ తరువాయి..** అడ్డుకోవడం, బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను దెబ్బతీయడం మరియు ఆ దేశ మిత్ర బృందాలను నిర్వీర్యం చేయడం వంటి ప్రధాన లక్ష్యాలను నెతన్యాహు ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ కూడా ధ్వజమెత్తారు. నాయకత్వం ప్రజలకు కేవలం భ్రమలు కల్పించిందని, తాజాగా కుదిరిన ఒప్పందం ఇజ్రాయెల్ భద్రతకు ఒక పెద్ద సవాలుగా మారబోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తానికి, నెతన్యాహు నిర్దేశించుకున్న లక్ష్యాలలో దేనినీ చేరుకోలేకపోయారనే అభిప్రాయం ఇజ్రాయెల్ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

## పాకిస్థాన్‌ను నమ్మలేం

**మొదటిపేజీ తరువాయి..** దాడులకు, ఇరాన్ ఆపరేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన వెల్లడించారు. దక్షిణ లెబనాన్ ప్రాంతంలో ఉన్న హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా దాడులు నిరంతరం కొనసాగుతాయని రాయబారి ఈ సందర్భంగా తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క: గిట్టుబాటు ధరపై రైతులకు భరోసా

**మహబూబాబాద్:** జిల్లాలోని మొక్కజొన్న రైతులకు ఊరటనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వేగంగా నిర్ణయం తీసుకుంది. గార్ల మండలం సీతంపేటలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క గురువారం అధికారికంగా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నారన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రైతులు దళారీలను నమ్మి తక్కువ ధరకు పంటను విక్రయించవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా మొక్కజొన్నకు రూ. 2,400 గిట్టుబాటు ధర కల్పిస్తోందని, అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పంటను అమ్ముకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రైతుల విజ్ఞప్తుల మేరకు నిబంధనల సడలింపుపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం ఎకరాకు 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, అయితే రైతులు 50 క్వింటాళ్ల వరకు పండించినా దానిని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పెద్ద ముప్పును తప్పించే హెచ్‌పీవీ టీకా

**విజయవంతంగా ముందుకెళ్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం**

**ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో కార్యక్రమం ఏర్పాటు**

**కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ**

**విజయవాడ, ఏప్రిల్ 9 :**

ఒక్క టీకా పెద్ద ముప్పును తప్పిస్తుందని.. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు. గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని సందర్శించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా కార్యక్రమంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని.. సమయానికి టీకా వేయడం ద్వారా ఇది పూర్తిగా నివారించగల వ్యాధి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్దిష్ట మార్గదర్శకాల ఆధారంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని వివరించారు. దేశంలోని బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును బహుమతిగా అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం అమలవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెళ్ళీశ్వరి, జేడీ డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే దేశంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని.. వివిధ స్థాయిల్లో సమగ్ర, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య పరిశోధనలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు.

## ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు

**సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం**

**గొల్లపూడి ఆయుష్మాన్**

**ఆరోగ్య మందిర్ సందర్శించిన కేంద్రకార్యదర్శి**

**విజయవాడ,ఏప్రిల్ 9 :**

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ గురువారం గొల్లపూడిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి.. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు, సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం వంటి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణకు అనుసరిస్తున్న విధానాలతో పాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్ - 100 రోజుల ప్రచార కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పోర్టబుల్ ఎక్స్‌రే వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలు తేలిగ్గా ఎక్కడెక్కడికో వెళ్లనవసరం లేకుండా తమకు దగ్గర్లోనే పరీక్షలు చేయించుకునేందుకు వీలవుతుంది. అనంతరం నిక్షయ్ మిత్ర చొరవ ద్వారా క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను అనుసంధానం చేస్తూ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు సత్వర నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2024, డిసెంబర్‌లో ప్రారంభమైన రెండో విడత ఇంటెన్సి÷డ్

టీబీ ముక్త భారత్ అభియాన్ ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని.. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటుతో పోలిస్తే భారత్‌లో టీబీ కేసులు, మరణాల తగ్గుదల రెట్టింపు వేగంతో కొనసాగుతున్నట్లు వివరించారు. డేటా విశ్లేషణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో దేశవ్యాప్తంగా టీబీ ముప్పు అధికంగా ఉన్న 1,58,000 గ్రామాలు, పట్టణ వార్డులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టీబీ ముక్త్ భారత్ యాప్ - నిక్షయ్ ద్వారా రోగులు, వైద్య నిపుణులకు సరైన మార్గనిర్దేశర అందుతోందని చెప్పారు. ఏఐ చాట్‌బాట్ ద్వారా రోగులకు తక్షణ సహాయం అందించడం జరుగుతోందని.. టీబీ రోగులకు పౌష్టికాహారం, సామాజిక మద్దతు అందించడంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా పౌష్టికాహారం, మానసిక స్థైర్యంతో టీబీపై విజయం సాధించవచ్చని పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సెంట్రల్ టీబీ డివిజన్) రఘురామ్ రావు, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెళ్ళీశ్వరి, జేడీ (ఎన్‌టీఈపీ) డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల్లో ప్రత్ఏక సదుపాయాలు

**పుష్కరాల ఏర్పాట్లపై సి.ఎస్ సమీక్ష**

**హైదాబాద్, ఏప్రిల్ 9 :** రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈ.ఎన్.సి.లు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

## వరి కొనుగోలు మరో 2 నెలలు పెంచాలి

**కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ**

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడవు పెంచాలని కోరారు. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒఓ÷ులకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

## దృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక పాఠశాల

**ఖమ్మం,ఏప్రిల్ 9 :** ఖమ్మం జిల్లాలో దృష్టి లోపం గల విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల వినతులు, ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక -ప్రజా పాలన లో భాగంగా ముందుకు వచ్చారు. ఖమ్మం నగర నడిబొడ్డున గల నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రత్యేక అవసరాలున్న, దృష్టిలోపం విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలగా సర్వాంగ

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


# దేశద్రోహం పేరిట వేధింపులు

❑ ప్రశ్నించే స్వరాల అణచివేతపై తీవ్ర ఆగ్రహం




సింగరేణి ప్రతినిధి( జన సంఘర్షణ)
సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలో ఈరోజు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై దేశద్రోహం కేసు నమోదు చేసి, ఈ నెల 22న విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సింగరేణి మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడుతూ.. "ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది" అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన తప్పు విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై కేసులు మోపడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోటు రంగారావుపై దేశద్రోహం కేసు నమోదు చేసి, జాతీయ దర్యాప్తు సంస్థ ద్వారా విచారణకు పిలవడం సిగ్గుచేటు చర్య అని ఆయన జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం, కొందరిని హత్యలకు గురిచేయడం, మరికొందరిని జైళ్లలో నిర్బంధించడం సాధారణంగా మారిందని ఆయన విమర్శించారు. ఈ విధమైన నిర్బంధ రాజకీయాలను వెంటనే పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే నాయకులు, కార్యకర్తలు, మేధావులు, జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని జైళ్లకు పంపడం ఒక అలవాటుగా మారిందని మండిపడ్డారు. అదేవిధంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం విభాగ కార్యవర్గ సభ్యుడు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ.. "ఇది నిజంగా ప్రజాస్వామ్య దేశమేనా అనే అనుమానం కలుగుతోంది" అని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన అనేక మంది ప్రజా నాయకులు, మేధావులు, విప్లవకారులు, నిలిపివేయాలని, పోటు రంగారావుపై నమోదైన దేశద్రోహం కేసును రద్దు చేయాలని, విచారణ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ సింగరేణి మండల నాయకులు రావుల నాగేశ్వరావు, పుల్లకాని సత్తిరెడ్డి, ధరావత్ సక్రు నాయక్, భూక్య నాగరాజు, గుగులోతు లచ్చు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా నిలిచిన రేగా కాంతారావు జన్మదినోత్సవం

❑ సేవయే పరమావధిగా రేగా బర్త్‌డే వేడుకలు
❑ కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మానవత్వం చాటిన బీఆర్ఎస్ శ్రేణులు





కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
రాజకీయాల్లో నాయకుడిపై అభిమానం అనేది కేవలం నినాదాలకే పరిమితం కాకూడదని, అది ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే సేవా రూపం దాల్చాలని లక్ష్మీదేవిపల్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు నిరూపించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు జన్మదినం సందర్భంగా నేడు జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనగా, లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకలు ప్రత్యేకతను సంతరిం చుకున్నాయి. కొట్టి వెంకటేశ్వరరావు, నాయకుడు కల్లుగడ్డ సురేష్ నేతృత్వంలో మండల కేంద్రంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం వారు నేరుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలివెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలు విచారించి వారికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆలోచింపజేసే ప్రశ్న: "నాయకుడి పుట్టినరోజున వేల రూపాయల బాణాసంచా కాల్చడం కన్నా, రోగికి ఒక పండు ఇవ్వడంలో ఉండే తృప్తి సాటిలేనిది కాదా?" అనే ఆలోచనను ఈ కార్యక్రమం ద్వారా కొట్టి వెంకటేశ్వరరావు సామాజిక వర్గాలకు గుర్తుచేశారు. ఆర్భాటాల కన్నా ఆత్మీయత ముఖ్యమని నమ్మి, కార్యకర్తలను సేవా పథంలో నడిపిస్తున్న ఆయన నాయకత్వం ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, మైనార్టీ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, ప్రశాంత్ నగర్ ఉప సర్పంచ్ ఎర్రబడి శ్రీను, మాజీ సర్పంచ్ తాదూరి రజాక్, చిన్న, మంద అశోక్, లావుడియా వెంకటేష్, రాజవరపు మురళి, బొమ్మగాని నాగరాజ్, వాంకుడోత్ శ్రీను, బద్రు, తంబాల శ్రీనివాస్, ప్రవీణ్, చిన్న నాయక్, వెలిశాల వినోద్, బోసు శివ, బొట్ల శ్రీను, ప్రభాకర్, రాజు, రాము, బన్ను, లచ్చు, సాగంటి రవి, రేగళ్లరవి తదితర ముఖ్య నేతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇల్లందు మండలంలో సర్పంచుల సంఘం ఏర్పాటు



ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)
ఇల్లందు మండలంలో సర్పంచుల ఐక్యతను బలోపేతం చేయడానికి సర్పంచుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలిగా పాయం స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నుకొని, ఆమెను శాలువాతో సత్కరించి, స్వీట్లు అందజేసి ఎమ్మెల్యే అభినందించారు. సంఘ పదవులు ఇలా ఉన్నాయి: అధ్యక్షురాలు: పాయం స్వాతి, ఉపాధ్యక్షుడు: గుగులోత్ నాగార్జున్, కార్యదర్శి: జరుపుల లక్ష్మణ్, కోశాధికారి: ఈసం బాలకృష్ణ, సహాయక కార్యదర్శి: ఈసాల సురేష్, గౌరవ సలహాదారు: వళ్ళాలా మంగమ్మ. ఈ కార్యక్రమంలో ఎన్నుకోబడిన సభ్యులతో పాటు పాయం లలిత, కుంజా సుగుణయ్య, చందావత్ రమేష్, అజ్మీరా బిత్స, జరుపుల అంజలి, మోకాళ్ల లావణ్య, అరేం ప్రియాంక, కోటి బానోత్, శంకర్ ఎపి, సనప సావిత్రి, తాటి యశోద, రమణ ఎట్టి, పూనెం స్వర్ణలత, ముక్తి రమేష్, సరస్వతి మూడ్, విజయకుమారి గోగ్గల, సరోజ దారావత్, భారతి వాంకుడోత్, సాయమ్మ, మచ్చ బానోతు శారద, అనూష భూక్యా, ధనసరి స్రవంతి, కిషోర్ బోడ తదితర సర్పంచులు పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు నాయక్, వైస్ ఎంపీపీ మండల రాము మహేష్, మాజీ సర్పంచ్ తాటి బిక్షం, మూతి కృష్ణ తదితరులు హాజరై సంఘానికి తమ మద్దతు తెలిపారు.

# పేదింటి కల్యాణానికి సర్కార్ భరోసా

❑ ఇల్లందులో 129 మందికి 'లక్ష్మీ' కటాక్షం!



ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
ఆడపిల్ల పెళ్లిని భారంగా భావించే నిరుపేద కుటుంబాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నేడు సామాజిక విప్లవానికి చిహ్నాలుగా మారాయి. గురువారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా మండల వ్యాప్తంగా ఉన్న 129 మంది లబ్ధిదారులకు రూ. 1,29,14,964 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక సీనియర్ ప్రతినిధిగా గమనించాల్సింది ఏంటంటే.. ఇక్కడ పంపిణీ చేయబడింది కేవలం కాగితపు చెక్కులు మాత్రమే కాదు, అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఒక తండ్రికి దొరికిన భరోసా, ఒక ఆడబిడ్డ భవిష్యత్తుకు లభించిన గౌరవం. ఒక్కో కుటుంబానికి సుమారు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందడం వల్ల, ఆ ఇంట పెళ్లి బాజాలు మరింత సంతోషంగా మోగుతాయి. సంక్షేమం అంటే కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాదని, అది సామాన్యుడి కన్నీళ్లు తుడిచే ఒక సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో అర్హులందరికీ ఈ ఫలాలు చేరవేయడం అభినందనీయం. ఇలాంటి పథకాలు ప్రజల్లోకి మరింత పారదర్శక వెళ్ళినప్పుడే నిజమైన ప్రజాపాలనకు అర్థం చేకూరుతుంది..

# మాజీ కేంద్రమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి


❑ నివాళులర్పించిన బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్...



హైదరాబాద్ సిటీబ్యూరో /ఏప్రిల్ 9( జనసంఘర్షణ )
గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం స్వర్గీయ అలె నరేంద్ర వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన బిజెపి నాయకులు. ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, నరేంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ..మాజీ కేంద్రమంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత టైగర్ ఆలె నరేంద్ర జనసంఘ్ నేతగా.. బిజెపి నాయకుడిగా.. తెలంగాణ ఉద్యమ నేతగా 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సాగించిన వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. టైగర్ నరేంద్ర వర్ధంతి సందర్భంగా వారికి శతకోటి వందనాలు తెలియజేస్తున్నమని అన్నారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, బాలకృష్ణ, మహమూద్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ రావు, లక్ష్మణ్ యాదవ్, సాయికుమార్, నీరజ్, లావణ్య, సంయుక్తా రాణి, అనుష, "పద్మశాలి సంఘం సభ్యులు" రాచ శ్రీనివాస్, వెంకటేష్, రఘునాథ్, పాపయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆశయ సాధనే లక్ష్యం

❑ ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా బాధ్యతల్లో ఉద్యమ నేత



కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
తెలంగాణ సిద్ధించిన దశాబ్దం తర్వాత నాడు నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారులు నేడు కనుమరుగవుతున్న తరుణంలో, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భద్రాద్రి జిల్లా బాధ్యతలను స్వీకరించడం ఒక సామాజిక బాధ్యతగా భావిస్తున్నాను. ఉద్యమ సమయంలో ఏ ఆశయాల కోసమైతే పోరాడామో, అవే ఆశయాలను నేటి రాజకీయ పటంలో సుస్థిరం చేస్తూ.. అణగారిన వర్గాల గొంతుకగా, ప్రజల పక్షాన నా తుది శ్వాస వరకు నిలబడతానని ఈ సందర్భంగా మీడియా ముఖంగా ప్రతినబూనుతున్నాను. అధికార అహంకారాల మధ్య సామాన్యుడి సమస్య ప్రశ్నార్థకంగా మారిన ఈ రోజుల్లో, నేతాజీ అడుగుజాడల్లో ప్రజా సేవకు పునరంకితమవుతూ నా వంతు బాధ్యతను నెరవేరుస్తానని సవినయంగా తెలియజేస్తున్నాను.

# వేసవి వేడిలో చల్లని కానుక-విద్యార్థులకు ఫ్యాన్లు పంపిణీ



❑ పాఠశాల అభివృద్ధికి గ్రామస్థుల ఆదర్శ చర్య

సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )
పొలంపల్లి గ్రామ పంచాయతీ పెద్దలకు, గ్రామ ప్రజలకు నమస్కారాలు.పొలంపల్లి గేట్ తండ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వేసవి వేడి నుండి ఉపశమనం కలిగించేందుకు గూగులోత్ రంగి తేజ్య నాయక్ ఫ్యాన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. ఈ ఉదార చర్య విద్యార్థుల చదువుకు ఎంతో మేలు చేయడంతో పాటు, వారి ముఖాల్లో ఆనందాన్ని నింపింది. వేడి కాలంలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ద్వారా విద్యార్థులు మరింత ఆసక్తిగా చదువుకోవడానికి ఇది తోడ్పడుతుంది. పాఠశాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు శ్రీను పాల్గొన్నారు. అలాగే పొలంపల్లి మాజీ సర్పంచ్ గుగులోత్ సక్రు నాయక్, 5వ వార్డు సభ్యురాలు అజ్మీరా సుజాత, బానోతు వినాయక్, భూక్యా నాగరాజు (ముత్యాలమ్మ ఆలయ దాత), గుగులోత్ రాము, విద్యార్థుల తల్లిదండ్రులు గుగులోత్ లైలా, అజ్మీరా సుగుణ, బోడ దేవి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం గ్రామంలో ఆదర్శంగా నిలిచి, విద్యార్థుల ప్రగతికి మార్గదర్శకంగా మారింది.

# మత్తులో చిత్తు కావొద్దు.. భవిష్యత్తును వెతుక్కోండి

❑ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: ఎస్సై సారంగపాణి



ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
ఇల్లందు పట్టణంలోని లేబర్ అడ్డా వేదికగా పోలీసు యంత్రాంగం నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు యువతకు ఒక హెచ్చరికగా, సమాజానికి ఒక మేల్కొలుపు గా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్సై సారంగపాణి మాట్లాడుతూ.. నేడు గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారులు యువతను నీడలా వెంటాడుతూ వారి ఉజ్వల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "కేవలం క్షణకాలం ఇచ్చే మత్తు కోసం కన్నవారి కలలను, మీ జీవితాలను బలి చేస్తారా?" అని ఆయన వేసిన సూటి ప్రశ్న అక్కడి వారిని ఆలోచింపజేసింది. కేవలం చట్టం ద్వారానే కాకుండా, సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లక్ష్య నిర్దేశితమైన జీవితాన్ని గడుపుతూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రత్నం, చారి, రమేశ్ వంటి పోలీస్ సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం, మత్తు రహిత సమాజ స్థాపనకు ఇల్లందు పోలీసులు కట్టుబడి ఉన్నారని మరోసారి స్పష్టం చేసింది.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
శుక్రవారం
10 ఏప్రిల్ 2026

# ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం: ఇల్లందులో చైతన్యవంతంగా సాగిన 'పోషక పక్వాడ'!

**❑ కౌన్సిలర్ శివ కిరణ్ ఆధ్వర్యంలో 'పోషక పక్వాడ'!**





ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)

నేటి బాలలే రేపటి పౌరులు.. వారు శారీరకంగా, మానసిక దృఢత్వంతో ఎదిగినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. ఈ ఆశయ సాధనలో భాగంగా ఇల్లందు పట్టణంలోని 22 మరియు 24వ వార్డుల్లో 'పోషక పక్వాడ' కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొర్లపాటి శివ కిరణ్ మాట్లాడుతూ.. సమాజంలో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు నిశ్శబ్ద శత్రువులని అభివర్ణించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తాము తీసుకునే ఆహారం పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "కేవలం కడుపు నింపుకోవడం ఆహారం కాదు.. శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడమే అసలైన పోషకాహారం" అని ఆయన ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని, ఇతర సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శనిగారపు శృతి కూడా పాల్గొని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్నపిల్లల ఎదుగుదలలో శుభ్రత ప్రధాన పాత్ర పోషిస్తుందని.. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే అవగాహన తప్పనిసరని ఆమె పేర్కొన్నారు. అయితే, ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ వేడుకగా కాకుండా ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు తేవాలన్నది ప్రధాన ఉద్దేశం. గర్భిణులు సరైన పోషకాలు తీసుకోకపోతే, అది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై జీవితకాల ప్రభావం చూపుతుంది. మారుతున్న జీవనశైలిలో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, స్థానికంగా లభించే ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లను స్వీకరించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు. ప్రజాప్రతినిధులు స్వయంగా వార్డుల్లో పర్యటిస్తూ ఇలాంటి చైతన్యాన్ని తీసుకురావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమం, ఆరోగ్యకరమైన ఇల్లందు స్థాపనకు ఒక బలమైన పునాదిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్థానిక మహిళలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందు మండల అధ్యక్షురాలిగా పాయం స్వాతి ఏకగ్రీవం

**❑ సర్పంచుల సంఘం సారథిగా పాయం స్వాతి**



ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)

గ్రామ వికాసానికి పట్టుకొమ్మలైన సర్పంచులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు, ఇల్లందు మండల సర్పంచుల సంఘం నూతన సారథిగా బాలాజీనగర్ సర్పంచ్ పాయం స్వాతి పగ్గాలు చేపట్టారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కీలక సమావేశంలో, కేవలం పదవి కోసం కాకుండా ప్రజాసేవలో సర్పంచుల గొంతుకను వినిపించే బలమైన నేతగా ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది; అభివృద్ధి నిధుల మంజూరులో జాప్యం, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పాలనాపరమైన చిక్కుముడులను ఈ నూతన కార్యవర్గం ఎలా విప్పబోతోందన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఉపాధ్యక్షుడిగా జి.నాగార్జున, కోశాధికారిగా ఇ.బాలకృష్ణలతో కూడిన ఈ బృందం.. "సమస్యల పరిష్కారమే మా అజెండా" అని స్పష్టం చేయడం సర్పంచులందరిలో కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయకర్తగా ఉంటూ, మండలంలోని ప్రతి గ్రామాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దడంలో పాయం స్వాతి తనదైన ముద్ర వేస్తారని స్థానిక నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పాల్వంచలో 'ఐక్య తల్లిదండ్రుల సంఘం' వినూత్న ప్రచారం!

**❑ పర్యావరణ పరిరక్షణే ప్రాణాధారం**




పాల్వంచ ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)

ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని, ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించాలని ఐక్య తల్లిదండ్రుల సంఘం పిలుపునిచ్చింది. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో సంఘం పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్' నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా స్థానికులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తూ, పర్యావరణానికి ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మారుతి రత్నాకర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా కేవలం మనుషులకే కాకుండా, నోరులేని మూగజీవాలకు, పక్షులకు దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో పక్షుల కోసం నీటి పాత్రలను ఏర్పాటు చేయాలని, అలాగే మిషన్ భగీరథ కుళాయిలు లీక్ కాకుండా చూస్తూ నీటి వృథాను అరికట్టాలని కోరారు. మండల కమిటీ సభ్యురాలు తులసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ నయీం, సభ్యులు లక్ష్మీనారాయణ మరియు స్థానిక యువత పాల్గొన్నారు. అభివృద్ధి పేరిట ప్రకృతిని విస్మరించడం వల్ల కలిగే అనర్థాలను ఈ తరం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిన్న చిన్న మార్పులే రేపటి తరానికి స్వచ్ఛమైన గాలిని, నీటిని అందించగలవని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

# ఘనంగా రేగా కాంతారావు జన్మదిన వేడుకలు!



కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)

నిరంతరం ప్రజల గొంతుకగా ఉంటూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పేరు గాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు జన్మదిన వేడుకలను సుజాతనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో నిర్వహించారు. గురువారం సుజాతనగర్ సెంటర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఒక రాజకీయ నాయకుడి జన్మదినం కేవలం ఆర్భాటాలకు, కేక్ కటింగ్‌లకు పరిమితం కాకుండా, పేదవాడి ఆకలి తీర్చే అన్నదానంగా మారడం అభినందనీయమని ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పేర్కొన్నారు. "అన్నా" అని పిలిస్తే అండగా నిలిచే నాయకుడికి ప్రజల దీవెనలే అసలైన బహుమతి అని, ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్, సీనియర్ నాయకులు చెల్ది రవి, మండే పూర్ణచంద్రరావు, అమన్ రాజేష్, గూని నరసింహారావు, బూరుగు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. అయితే, సమాజం గమనించాల్సింది ఏంటంటే.. పదవుల్లో ఉన్నా లేకపోయినా ప్రజాక్షేత్రంలో ఉంటూ, సామాన్యుడి కష్టాన్ని పంచుకునే నాయకత్వమే కాలపరీక్షకు నిలబడుతుంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపడమే కాకుండా, ప్రజల్లో నాయకుడి పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తాయి.

# జూన్ 2 నుంచి సర్కారీ బడుల్లో అల్పాహారం!

**❑ విద్యారంగంలో నూతన శకం**



కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)

అంతరాలు లేని ఆదర్శ సమాజం కేవలం నాణ్యమైన విద్య ద్వారానే సాధ్యమవుతుందని నమ్ముతూ, తెలంగాణ విద్యా వ్యవస్థలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. రానున్న జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థుల పాలిట వరంలా మారనుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, 100 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా, పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్న భట్టి విక్రమార్క గారి సంకల్పం స్పష్టమవుతోంది. ఆకలి లేని చదువు, అంతరాలు లేని బోధన అనే దిశగా ప్రభుత్వం వేస్తున్న ఈ అడుగులు, భవిష్యత్ తరాల తలరాతను మార్చే ఒక బలమైన సామాజిక పెట్టుబడిగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పర్యటన

బోధన్ : ఏప్రిల్ 09 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బోధన్ సబ్-కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ బోధన్ ఏసీపీ, ఇతర సంబంధిత అధికారులు కలిసి 11 శనివారం నుండి ప్రారంభం కానున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పర్యటన కార్యక్రమం నేపథ్యంలో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌తో సమన్వయం చేస్తూ అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ఎ, ఎస్,ఎల్ నివేదికను సమగ్రంగా సిద్ధం చేసి, నిర్ణీత గడువులోగా న్యూ ఢిల్లీలోని హోం మంత్రిత్వ శాఖ సచివాలయానికి సమర్పించాలని నిర్ణయించారు. హోం మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ సూచించిన మార్గదర్శకాల ప్రకారం మోహన్ భాగవత్ కి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ఎఎస్ఎల్ ఏర్పాట్లు కల్పించబడ్డాయి.

# గ్రామాల ప్రగతే లక్ష్యంగా సాగాలి

**❑ ఎమ్మెల్యే కోరం కనకయ్య దిశానిర్దేశం!**



గ్రామ పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలన్న గాంధీజీ ఆశయ సాధనలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షురాలు పాయం స్వాతి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా, ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సర్పంచులు అందరు సమన్వయంతో పని చేసినప్పుడే పల్లెలు ప్రగతి పథంలో వెళ్తుంది, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా సాగాలని దిశానిర్దేశం చేశారు. తన ఎన్నికలో అండగా నిలిచిన సర్పంచులు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, మండల ప్రగతిలో భాగస్వామ్యం అవుతానని పాయం స్వాతి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అయితే, ఇక్కడ గమనించాల్సిన అంశం ఏంటంటే.. పదవులు కేవలం గౌరవ సూచకాలు మాత్రమే కాదని, అవి ప్రజలకు సేవ చేసే బాధ్యతాయుతమైన ఆయుధాలని ప్రజాప్రతినిధులు గుర్తించాలి. కేవలం కలయికలు, సత్కారాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకూ చేరినప్పుడే ఇలాంటి పలకరింపులకు నిజమైన అర్థం లభిస్తుంది.

# అభివృద్ధి పనులు.. ప్రజల అవస్థలు

**❑ ఇల్లందు 16వ వార్డులో పడరాని పాట్లు!**



పట్టణ ప్రగతి అంటే కేవలం నిధుల కేటాయింపు, నిర్మాణ పనుల ఆర్భాటం మాత్రమే కాదు, ఆ పనుల వల్ల సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడటం కూడా కనీస బాధ్యత. ఇల్లందు పట్టణంలోని 16వ వార్డు మున్సిపల్ వాటర్ ట్యాంక్ సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పనులే ఇందుకు నిదర్శనం. పనులు పూర్తయి రోజులు గడుస్తున్నా, తీసిన మట్టిని, చెత్తాచెదారాన్ని అక్కడే వదిలేయడం వల్ల స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇరుకైన దారుల్లో ఈ మట్టి గుట్టలు అడ్డంకిగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంటే, గాలికి రేగుతున్న దుమ్ముతో వాహనదారులు, పాదచారులు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారు. విడ్డూరం ఏమిటంటే.. నిత్యం ఇదే మార్గంలో ప్రయాణించే ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ఉన్నతాధికారులు కళ్లున్నా చూడలేని స్థితిలో ఉండటం శోచనీయం. అభివృద్ధి పేరిట చేసే పనులు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, వారిని ఇబ్బందుల పాలు చేసేలా ఉండకూడదు. తక్షణమే సంబంధిత యంత్రాంగం స్పందించి, ఆ వ్యర్థాలను తొలగించి ప్రజల గోడు వినాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పింఛన్ల పెంపు సాధనకై మరో ఉద్యమానికి సిద్ధం కండి...

**❑ విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ..**



బోధన్ : ఏప్రిల్ 09 జన సంఘర్షణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ విమర్శించారు. చేయూత పింఛన్లను పెంచుతానని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మోసం చేస్తుందని చేయూత పింఛన్ల పెంపు కొరకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని, ఉద్యమాలతోనే పింఛన్లను సాధించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలను నిగ్గు తేల్చటానికి మందకృష్ణ మాదిగ ద్వారానే సాధ్యమని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా పింఛన్ల పెంపును ఉద్యమాలతో సాధిస్తామని అన్నారు. మంద కృష్ణ మాదిగ ఎలాంటి నిర్ణయం తీసుకున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకత్వం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# పేదరికంపై 'కల్యాణ' విజయం

◆ సర్పంచ్ రమేష్ బాబు చొరవతో లబ్ధిదారులకు అండ!




ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
ఆడబిడ్డ పెళ్లిని ఒక పండుగలా జరుపుకోవాలన్న నిరుపేద తండ్రి ఆశయానికి, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసా కొండంత ధైర్యాన్నిస్తోంది. ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి నగర్ గ్రామ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన గ్రామ పరిధిలోని లబ్ధిదారులకు వచ్చిన చెక్కులు ఏ ఒక్కటి కూడా జాప్యం కాకూడదని, నేరుగా వారి చేతుల్లోకి చేరాలని సర్పంచ్ రమేష్ బాబు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించడం ఆయన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయతీ నుంచి ఎంపికైన లబ్ధిదారులను స్వయంగా క్యాంపు కార్యాలయానికి తీసుకువచ్చి, రెవెన్యూ అధికారులతో (ఎం ఆర్ ఓ) సమన్వయం చేస్తూ, వారికి అందాల్సిన ఫలాలను సర్పంచ్ రమేష్ బాబు ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో అర్హుడైన ప్రతి ఒక్కరికీ అందాలని, ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఈ ఆర్థిక సాయం ఒక ఆసరాగా నిలుస్తుందని" ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధి అంటే కేవలం పదవికి పరిమితం కాకుండా, లబ్ధిదారులకు అధికారులకు మధ్య వారధిగా ఉండి సమస్యలు పరిష్కరించడం సర్పంచ్ రమేష్ బాబు శైలి అని గ్రామస్తులు కొనియాడుతున్నారు.

# బాల్యానికి భరోసా: హక్కుల పరిరక్షణలో రాజీ వద్దు

◆ కమిషనర్ సీతా దయాకర్ రెడ్డి, కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)




రేపటి పౌరులైన బాలల భవిష్యత్తును కాపాడటం కేవలం చట్టాల బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి తల్లిదండ్రుల సామాజిక కర్తవ్యమని బాలల హక్కుల కమిషనర్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలల హక్కుల పరిరక్షణపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రుల్లో అవగాహన పెరిగినప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుందని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు, మత్తు పదార్థాల నియంత్రణపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాలో అంగన్‌వాడీల నుండి కళాశాల స్థాయి వరకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, 1098 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా చిన్నారుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతున్నామని భరోసా ఇచ్చారు. ఏప్రిల్ 23 తర్వాత ప్రారంభం కానున్న 'బడిబాట' ద్వారా డ్రాప్‌అవుట్లను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గంజాయి రవాణాపై నిఘా, పోక్సో కేసుల సత్వర విచారణపై పోలీస్ శాఖ తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలను వివరించారు. అయితే, ఒక విశ్లేషణాత్మక కోణంలో గమనిస్తే.. కేవలం సమీక్షలు, గణాంకాలకే పరిమితం కాకుండా, గిరిజన అటవీ ప్రాంతాల్లోని చివరి బిడ్డకు కూడా రక్షణ, విద్య అందేలా క్షేత్రస్థాయి అధికారులు అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. లింగ నిర్ధారణ వంటి సామాజిక రుగ్మతలను మూలాల నుండి తుడిచిపెట్టినప్పుడే ఇలాంటి సమావేశాలకు సార్థకత లభిస్తుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కమిటీ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 11న కిసాన్ సభ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

◆ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లో సాగర్, సారంపల్లి పిలుపు..




హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 9( జనసంఘర్షణ )
అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెయస్) 90వ వార్షికోత్సవాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో విజయవంతం చేయాలని ఈరోజు (ఏప్రిల్ 9న) ఆర్‌టిసి క్రాస్ రోడ్లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ...ఏప్రిల్ 11న లక్నోలో స్వామి సహజానంద్ సరస్వతి నేతృత్వంలో ఏర్పాటైన భారతదేశ అతిపెద్ద రైతు సంఘం. ఇది బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, జమీందారీ వ్యవస్థ రద్దు, భూ సంస్కరణలు, రుణ విముక్తి రైతుల హక్కుల కోసం పోరాడింది . కార్పొరేట్ అనుకూల , రైతు వ్యతిరేక చట్టాలను ప్రతిఘటించింది. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేందుకు వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ రూపంలో మళ్లీ సామ్రాజ్యవాదులు భారతదేశంలోకి వ్యవసాయ రంగంలోకి చొరపడేందుకు అవకాశం ఇస్తున్నారు. మరోవైపు రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారు ఎఐకెయస్ ఆవిర్భావ స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాదానికి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామ గ్రామాన జెండావిష్కరణలు చేసి ప్రతిజ్ఞలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్,రాష్ట్ర నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల కడుపు కోత.. అధికారుల మొండి వైఖరి





◆ సింగరేణిపై రగిలిన ఇద్దరు 'సర్పంచుల' సమరశంఖం!

ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
పదవులు ఉన్నది అధికారం చెలాయించడానికి కాదు, తమ నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పోరాడటానికని విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు, తిలక్ నగర్ సర్పంచ్ స్రవంతి మరోసారి నిరూపించారు. జెకె-5 ఓసీ విస్తరణ పేరుతో సింగరేణి యాజమాన్యం సాగిస్తున్న రాక్షస కాండకు వ్యతిరేకంగా ఈ ఇద్దరు ప్రజాప్రతినిధులు గడచిన వారం రోజులుగా అగ్నిపర్వతంలా రగులుతున్నారు. ఒకపక్క రమేష్ బాబు జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు అధికారుల మెడలు వంచుతుంటే, మరోపక్క సర్పంచ్ స్రవంతి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరుస్తూ ఈ ఉద్యమాన్ని ఒక ఉప్పెనలా మార్చారు.

**అధికారుల నిద్రమత్తు వదిలిస్తున్న ఏకగ్రీవ తీర్మానం:**

గురువారం నిర్వహించిన గ్రామసభలో ఈ ఇద్దరు సర్పంచులు కలిసి తీసుకున్న నిర్ణయం అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. "మా గూడును, మా అస్తిత్వాన్ని సింగరేణి సమాధి చేస్తుంటే చూస్తూ ఊరుకోం" అంటూ రెండు పంచాయతీల తరపున చేసిన ఏకగ్రీవ తీర్మానం సింగరేణి యాజమాన్యానికి గట్టి హెచ్చరిక పంపింది. అఖిలపక్ష నాయకులను ఏకతాటిపైకి తెచ్చి, విభేదాలను పక్కన పెట్టి కేవలం ప్రజల న్యాయం కోసమే పోరాడుతున్న రమేష్ బాబు మరియు స్రవంతిల తీరు ఇప్పుడు ఇల్లందు నియోజకవర్గంలో సంచలనంగా మారింది.

**బతుకులు రోడ్డున పడుతుంటే.. సంతకాలు ఎందుకు?**

రైతుల పొలాల్లో పచ్చని పంటలను నాశనం చేస్తూ, కనీసం పరిహారంపై మాట కూడా ఇవ్వకుండా సింగరేణి సాగిస్తున్న వినాశనాన్ని ఈ ఇద్దరు సర్పంచులు తీవ్రంగా ఖండించారు. "130 ఏళ్లుగా ఈ గడ్డపై బతుకుతున్నాం.. ఇప్పుడు అన్యాయంగా మా బతుకు దీపాలను ఆర్పేస్తారా?" అని సర్పంచ్ స్రవంతి వేస్తున్న సూటి ప్రశ్నలు అధికారుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఎంపీడీవో సమక్షంలోనే జనం పిడికిలి బిగించి, తమ సర్పంచుల వెంటే నడుస్తామని తెలిపారు.

**బతుకు దెరువు లేని 'నిర్వాసి' ఏ తరుపు?**

రైతుల పొలాల్లో పంటలను సమాధి చేస్తున్న సింగరేణి క్రూరత్వానికి రమేష్ బాబు పదునైన ప్రశ్నలతో సమాధానం చెబుతున్నారు. "ప్రపంచాన్ని వెలిగించిన మా చేతులతోనే మా బతుకు దీపాలను ఆర్పేస్తారా?" అని ఆయన వేస్తున్న నిలదీత అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎంపీడీవో సమక్షంలో జరిగిన ఈ సభలో ప్రజలందరూ రమేష్ బాబు వెంటే తామున్నామని, జైలుకైనా.. చావుకైనా సిద్ధమని ప్రకటించడం ఈ ఉద్యమ తీవ్రతను చాటుతోంది. అఖిలపక్ష నాయకులు, సర్పంచ్ స్రవంతి తదితరులతో కలిసి రమేష్ బాబు రగిలించిన ఈ పోరాట జ్వాల, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు చల్లారే ప్రసక్తే లేదని స్పష్టమవుతోంది. అధికారులారా.. సామాన్యుడి కడుపు కోతను చూసైనా మీ మొండి వైఖరి వీడండి, లేదంటే ఈ ప్రజాక్షేత్రమే మీ నిర్లక్ష్యానికి సమాధి కడుతుంది!


# దశాబ్దాల నాటి బావికి పునర్జీవం

◆ దాహార్తిని తీర్చడంలో సర్పంచ్ శారద 'భగీరథ' ప్రయత్నం!



ఇల్లందు ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
పదవి అంటే అధికారం మాత్రమే కాదు, అది ప్రజల కష్టాలను తీర్చే ఒక అద్భుతమైన అవకాశం అని రేపల్లెవాడ గ్రామ సర్పంచ్ శారద మరోసారి నిరూపించారు. దశాబ్దాలుగా గ్రామానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న పురాతన బావి, గత ఏడాది కాలంగా మోటార్ మరమ్మతుల కారణంగా నిరుపయోగంగా మారింది. రానున్నది కఠినమైన వేసవి కాలం కావడంతో, ముంచుకొస్తున్న నీటి ఎద్దడిని ముందుగానే పసిగట్టిన సర్పంచ్ శారద, అధికారులు లేదా నిధుల కోసం వేచి చూడకుండా స్వయంగా రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో బావిని, మొరాయిస్తున్న మోటార్‌ను పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయించి తిరిగి వాడుకలోకి తీసుకువచ్చారు. సమస్యలు ఎదురైనప్పుడు ఫిర్యాదులకే పరిమితం కాకుండా, ఒక ఇంటి యజమానిలా స్పందించి పరిష్కారం చూపిన సర్పంచ్ తీరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఇలాంటి నిబద్ధతతో పనిచేసినప్పుడే వేసవి కాలంలో పల్లెలు నీటి ఎందమాములుగా మారకుండా పచ్చగా ఉంటాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ బావి నేడు మళ్లీ జలకళను సంతరించుకోవడం రేపల్లెవాడ ప్రజల దాహార్తికి శాశ్వత పరిష్కారంగా మారింది. ప్రజల అవసరాలను గుర్తించి, సమయస్ఫూర్తితో స్పందించిన సర్పంచ్ శారద నిర్ణయం ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తోంది.

# అంబర్పేటలో రోడ్డు ప్రమాదం మున్సిపల్ కార్మికురాలు మృతి..



హైదరాబాద్ సిటిబ్యూరో / ఏప్రిల్ 9( జనసంఘర్షణ )
అంబర్ పేటలో ఆలీ కేఫ్ చౌరస్తా వద్ద గురువారం వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు గుద్దడంతో విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ కార్మికురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద దృశ్యాలు అక్కడ సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి న్యాయం జరిగేంత వరకు ధర్నా కొనసాగుతుందని అతివేగమే మృతుల చావుకు కారణమైందని డ్రైవర్ని వెంటనే అరెస్టు చేసి దర్యాప్తు చేయాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతురాలు పుష్పకు న్యాయం జరిగేంత వరకు ఈ ధర్నా కొనసాగుతుందని స్థానికులు తెలిపారు పోలీసులు సముదాయించే ప్రయత్నం చేసిన కార్మికులు పట్టుపట్టారు. కార్మికులకు అండగా స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. రెండు గంటల వరకు స్థానిక రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# 'యంగ్ ఇండియా' పాఠశాల పనుల్లో వేగం పెంచండి

◆ కలెక్టర్ అంకిత్
◆ విద్యా కుసుమాల వికాసానికి అడుగులు



కొత్తగూడెం ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)
రేపటి తరం భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా క్షేత్రాల నిర్మాణంలో ఎటువంటి జాప్యం జరగకూడదని, లక్ష్యాలకు అనుగుణంగా పనులను పరుగులు పెట్టించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల' నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న లెవెలింగ్ పనులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ మ్యాప్ ను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాల కేవలం భవనం మాత్రమే కాదని, పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి వసతులను అందించే ఒక జ్ఞాన నిలయమని పేర్కొన్నారు. తరగతి గదుల నుండి లైబ్రరీల వరకు, అంతర్గత రహదారుల నుండి మౌలిక వసతుల వరకు ప్రతి అంశం అత్యుత్తమ ప్రమాణాలతో ఉండాలని స్పష్టం చేశారు. "పనుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.. అవసరమైతే అదనపు సిబ్బందిని, యంత్రాలను మోహరించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి" అని అధికారులను హెచ్చరించారు. కేవలం ఆదేశాలతో సరిపెట్టకుండా, పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని ఆదేశించడం కలెక్టర్ పర్యవేక్షణ తీరుకు నిదర్శనం. అయితే, ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలంటే అధికారుల్లో కేవలం పని పట్ల బాధ్యత మాత్రమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు పట్ల అంకితభావం కూడా ఉండాలని ఈ పర్యటన స్పష్టం చేస్తోంది. కలెక్టర్ అంకిత్ స్వయంగా ఎండను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. అత్యుత్తమ సౌకర్యాలతో ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే, జిల్లా విద్యా ముఖచిత్రమే మారిపోతుందనడంలో సందేహం లేదు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మన ఊరు - మన భద్రత - మన బాధ్యత

- సిపి వెల్లడి.
- 'అరైవ్ అలైవ్-2026' లో రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై గ్రామ సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



**బోధన్: ఏప్రిల్ 09 జన సంఘర్షణ**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో కొత్తగా ఎన్నికైనటువంటి గ్రామ సర్పంచులతో మన ఊరు - మన భద్రత - మన బాధ్యత అనే కార్యక్రమాన్ని నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని కామాక్షి కన్వెన్షన్ హాలు నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. హాజరు కావంద జరిగింది ఈ సందర్భముగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు అరేవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా నిర్వహించాలనేటువంటి ఉద్దేశంతో నిర్వహించారు. వ్యవసాయాదరులు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకం నిషేధం అని , ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూడాలని , యువత డ్రగ్స్ కు బానిస కాకుండా ప్రతీ ఒక్కరు వారిని గమనిస్తూ ఉండాలని, ఆన్లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం, క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారి తీస్తాయని వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ, ట్రాఫిక్ నియమాల కట్టుదిట్టమైన పద్ధతుల ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో అవగాహన పెరిగి, రోడ్డు ప్రమాదాల నివారణకు, డ్రగ్స్ మీద యువతకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఆర్మూర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి తల్లిదండ్రులు వచ్చి మాట్లాడారు. ఆ తరువాత అరైవ్ అలైవ్ సంబందించిన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లహరి రఘు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాటిపల్లి గంగారెడ్డి, ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర రెడ్డి, సైబర్ క్రైమ్ ఏసిపి, వెంకటేశ్వర్లు, ఆర్మూర్ టౌన్ సిఐ సత్యనారాయణ, ఆర్మూర్ రూరల్ సీ.ఐ జి. జాన్ రెడ్డి, ఐ-రాడ్ మేనేజర్ శ్రీ వర్ష, ఆర్మూర్ డివిజన్ ఎస్.ఐ లు రజనీకాంత్, సంజీవ్, అనిల్, రాము, శ్యామ్ రాజ్, శైలేందర్, కిరణ్ పాల్, రాజేశ్వర్, ఎన్,ఎస్,సి కౌన్సిల్ మెంబర్స్ సుందర్, క్రాంతి గంగారెడ్డి, నిజంసాగర్ మాజీ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వై.సాయ రెడ్డి, సాగర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లు, వార్డ్ కౌన్సిలర్లు, ప్రజలు, పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో 22 సీసీ కెమెరాలు ప్రారంభించిన సిపీ





**బోధన్ : ఏప్రిల్ 09 జన సంఘర్షణ**

ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని భక్త ఆంజనేయ మందిరం యందు గురువారం రోజున 22 సీసీ కెమెరాలను నిజామాబాద్ సిపి సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని, ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, కౌన్సిలర్ విజయ్ అగర్వాల్ (దియా), జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, సీసీ కెమెరాల ఇన్స్టాలేషన్ ప్రవీణ్ చారి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# గార్ల మండలంలో ఘనంగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన..

**ఇల్లెందు ప్రతినిధి : (జన సంఘర్షణ)**

మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా గార్ల మండలానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి ధనసరి అనసూర్య (సీతక్క)కి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పర్యటనలో ముఖ్య భాగంగా సీతంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య కలిసి ప్రారంభించారు. రైతులకు మద్దతు ధరతో పంటను విక్రయించే సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గమనిస్తోందని, పంటలకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ..ఇల్లందు నియోజకవర్గంలో రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.



# షికారు కాలనీ గ్రామస్తులకు జెఎల్‌జి లోన్లు పంపిణీ

- ముఖ్యఅతిథిగా మురళీమోహన్
- సింగల్ విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి

**వెదురు కుప్పం, ఏప్రిల్ 8 (జన సంఘర్షణ)**

వెదురు కుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ షికారు కాలనీకి చెందిన తొమ్మిది గ్రూపులకు జేయల్‌జి లోన్లు 2250000 రూపాయలు కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్, సూచనలు మేరకు మంజూరు చేయడం జరిగినది. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బోడి రెడ్డి సుధాకర్ రెడ్డి, సీఈఓ రమేష్, బ్యాంకు సిబ్బంది, వెదురు కుప్పం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మోహన్ మురళి, సింగిల్ విండో డైరెక్టర్ మనోహర్ నాయుడు, క్లస్టర్ కన్వీనర్ బోడి రెడ్డి వెంకటరమణారెడ్డి, క్లస్టర్ కో కన్వీనర్ జానకిరామ్ రెడ్డి, యూనిట్ కన్వీనర్ కిరణ్ యాదవ్, పచ్చికాపలం గ్రామ కమిటీ అధ్యక్షులు జయరాం రెడ్డి బూత్ కన్వీనర్లు శేషాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవి పరీక్షలు

**బోధన్ ఏప్రిల్ 09. జన సంఘర్షణ**




బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ఆరోగ్య ఆవరణలో భాగంగా గురువారం ఉదయం పలువురికి పరీక్షలు చేపట్టారు. లైంగిక వ్యాధి నిపుణులచే ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాహుల్, సొసైటీ ప్రతినిధులు కుమార్ తదితరులు ఉన్నారు.

# ఇల్లందు మండలంలో నూతన తహసిల్దార్‌కు బీఆర్ఎస్ నాయకుల శుభాకాంక్షలు

**ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)**



ఇల్లందు మండల నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ, మండల అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలని కోరారు. మండల ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం గాంధీ మృతికి కారణం

- సిఐ సాయి ప్రసాద్



**చౌడేపల్లి ఏప్రిల్ 09 (జన సంఘర్షణ)**

ఇటీవల బోయకొండ అడవిలో గాంధీ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు ఆయన కథనం మేరకు... రెండు సంవత్సరాల క్రితం తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతం చెందిన గాంధీ తన భార్య అయిన రసాధితో కలసి చౌడేపల్లి మండలం ఊటూరు దగ్గర కోళ్ల ఫారం లో పనికి వచ్చి ఉండేవారు. ఈ క్రమంలో బోయకొండ ఆర్ఆర్ కాలనీకి చెందిన నర్సిములు ఆమెకు పరిచయం అయ్యి తన భర్తను వదిలి నరసింహులు తోపాటు రాసాతి వెళ్లిపోయింది. అతనితో సహజనం చేస్తూ ఉంటే పది రోజుల క్రితం గాంధీ బోయకొండకు వచ్చి తన భార్యను తనతో రమ్మని వేధించగా నరసింహులు అతని తమ్ముళ్లు లక్ష్మీపతి నాగరాజు రసాధిలో పథకం ప్రకారం ఈనెల ఐదున రాత్రి 8 గంటలకు గాంధీని అడవిలోకి తీసుకెళ్లి మద్యం తాపించి రాళ్లతో కట్టెలతో కొట్టి చంపి అక్కడే విడిచి పారిపోయారని ఆయన వివరించారు. ఈ సంఘటనపై గాంధీ తమ్ముడు అయిన సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌడేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించామన్నారు. ఈ క్రమంలో వారి నలుగురును 9న ఉదయం 10 గంటలకు బోయకొండ ఆర్చి నిమ్మనపల్లి రోడ్డు నందు అరెస్టు చేసి వారు నేనానికై ఉపయోగించిన కట్టె రాళ్లను స్వాధీనపరచుకొని ముద్దాయిలను రిమాండ్కు తరలించినట్లు సిఐ వివరించారు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే కేసును చేదించడం విశేషం.

# సూళ్లూరుపేట మండలం మన్నే ముత్తూరి గ్రామంలో ఇంటిలో చోరీ

**సూళ్లూరుపేట ఏప్రిల్ 9 2026 గురువారం (జన సంఘర్షణ)**



సూళ్లూరుపేట మండలం మన్నే ముత్తూరి గ్రామంలో పాస్టర్ బాలసుందర్ రాజు ఇంట్లో బుధ వారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు చెన్నైకి వెళ్లడం గమనించిన దొంగలు ఇంటికి తాళం వేచి ఉండటంతో తాళాలు పగలగొట్టి ఇంటిలోనికి ప్రవేశించి సుమారు 8 లక్షల నగదు 8 సవర్ల బంగారు అపహరించారు. ఉదయం సహాయకుడు గమనించడంతో ఘటన వెలుగులోనికి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు సీసీ కెమెరాలు దృశ్యాలు పరిశీలిస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## కోహెడ నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సామల నవీన్ కుమార్




**సిద్దిపేట జనసంఘర్షణ**

సిద్దిపేట జిల్లా కోహెడ మండల నూతన తహసిల్దారుగా సామల నవీన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, జిల్లాలోని పలువురు తహసిల్దారులను డెప్యూటేషన్పై బదిలీ చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా కోహెడ తహసిల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు నవీన్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.అదేవిధంగా, మండల గిర్ధవార్ గా ఆర్. సంజీవ్ కుమార్ కూడా విధుల్లో చేరారు.ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది నూతన తహసిల్దారుకు ఘనస్వాగతం పలికారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దారు కి సీనియర్ సహాయకులు బి. రాములు, గిర్ధవార్-2 బి. ఎల్లయ్య, మండల సర్వేయర్ జైపాల్ గౌడ్ పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలనాధికారులు మీ-సేవ మరియు భూభారతి ఆపరేటర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ సేవలను పారదర్శకంగా అందిస్తానని, మండల అభివృద్ధికి సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ని సన్మానించిన డాక్టర్ పేట భాస్కర్

**కోరుట్ల జనసంఘర్షణ :**



సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా తాడిత పిడిత అనగారిన ప్రజల పక్షాన అజ్ఞాతంలో ఉద్యమించిన మాజీ మావోయిస్టు అగ్ర నేత తిపిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ లొంగిపోయిన అనంతరం మొదటి సారి తన జన్మస్థలమైన కోరుట్ల పట్టణం అంబేద్కర్ నగర్ లోని తన సొంత ఇంటికి వచ్చిన సందర్భంగా గురువారం తన తమ్ముడి నివాసంలో వున్న దేవ్ జీ ని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా దండోర దినపత్రిక ఎడిటర్ డాక్టర్ పేట భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై మాట్లాడారు భవిష్యత్తులో రాజ్యాంగ బద్ధంగా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మీలాంటి ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రజలు అండగా నిలుస్తారని ఆశిస్తున్నట్లు దేవ్ జీ తెలిపారని పేట భాస్కర్ అన్నారు. ఈ సన్మానంలో పేట భాస్కర్ తో పాత్రికేయులు ఇందూరి నరేష్, నాయకులు ఎలిశెట్టి గంగారెడ్డి, ఆర్ భూమయ్య లు పాల్గొన్నారు..

## సీసీ రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ మాజీ కార్పొరేటర్ బన్నాల గీత




**ఉప్పల్ జనసంఘర్షణ :**

బీరప్పగడ్డ డివిజన్ ప్రాంతంలో 27 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. తేనె లక్ష్మీనరసింహ ఆలయం పక్కన ఉన్న వీధి, అలాగే సత్యనారాయణ కిరాణా దుకాణం పక్కన ఉన్న వీధిలో జరుగుతున్న పనులను ఆమె జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా గీతా ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నాం" అని స్పష్టం చేశారు. రోడ్డు పనుల్లో నాణ్యతకు ఎట్టి పరిస్థితుల్లో విఘాతం కలగకూడదని కాంట్రాక్టర్కు ఆదేశించడంతో పాటు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు నిర్మాణం మొత్తం కాలంలో జిహెచ్ఎంసి అధికారులు పర్యవేక్షణంగా నిర్వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారి కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొక్కొండ జగన్, బింగి శ్రీనివాస్,ఎద్దుల కొండల్ రెడ్డి,గోపు ఆనంద్, ఇంద్రసేనారెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్,బాలకృష్ణ గౌడ్, బీరప్పగడ్డ బాలు, శ్యామ్,బంటి గౌడ్,అలాగే బస్తీ వాసులు సత్యనారాయణ,రాజ్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు

**కూకట్పల్లి/ప్రజా వారధి:**




కూకట్పల్లి నియోజకవర్గ బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ గురువారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కుకట్పల్లి లైన్స్ క్లబ్ సెక్రటరీ ఐస్ క్రీమ్ వెంకటరెడ్డి మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం పెరుగుతున్న క్రమంలో లయన్స్ క్లబ్ వారు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రజలకు తోడుగా నిలిచే నాయకత్వం

**- మందుముల పరమేశ్వర్రెడ్డి**

**ఉప్పల్ జనసంఘర్షణ :**

జనం కోసం జనంతో నడిచే మీ బిడ్డగా... మీ చేతుల్లో పెరిగిన నేను... మీ కోసం పని చేయకుండా ఎలా ఉంటాను?" అంటూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు.రేవంతన్న నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆశల్ని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుందని, ఆ ప్రయాణంలో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలతో తాను ఎప్పుడూ ఉంటానని తెలిపారు. కష్టసుఖాల్లో ప్రజల పక్కనే నిలబడి, సమస్యలు



పరిష్కారం దిశగా కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రజల ఆశలు నెరవేర్చే సేవలే తన రాజకీయ ధ్యేయమని పరమేశ్వర్రెడ్డి పునరుద్ఘాటించారు.ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకటి ఆగం రెడ్డి,బొమ్మగొని చైతన్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు,

## వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించిన. ట్రాఫిక్ సిఐ తిమ్మప్ప

**కూకట్ పల్లి జనసంఘర్షణ :**

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కూకట్పల్లి ట్రాఫిక్ సీఐ తిమ్మప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన లభించిందని.ఈ సందర్భంగా సిఐ తిమ్మప్ప స్వయంగా రోడ్డుపైకి దిగి హెల్మెట్ ధరించని వాహనదారులను ఆపి, వారి ప్రాణ రక్షణలో హెల్మెట్ ఎంత కీలకమో వివరించారు. హెల్మెట్ ధరించినప్పటికీ స్ట్రాప్ సరిగా పెట్టుకోని వారికి కూడా సరైన జాగ్రత్తలు సూచించారు.పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేస్తూ,నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను అభినందించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిపారు. అదేవిధంగా పాదాచారుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తూ, సిగ్నల్ వద్ద ఎరుపు దీపం వెలిగినప్పుడు వాహనదారులు తప్పనిసరిగా ఆగి, పాదాచారులు రహదారి దాటే వరకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సిఐ తిమ్మప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ట్రాఫిక్ సిబ్బంది చురుకుగా పాల్గొని ప్రజల్లో విస్తృత



# ఎన్ఎస్ యూఐ 56వ ఆవిర్భావ దినోత్సవం

**-రామంతపూర్లో విద్యార్థుల జోష్,యువత శక్తి సందడి**

**-రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ**

**రామంతపూర్ జనసంఘర్షణ :**

ఎన్ఎస్ యూఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రామంతపూర్లో ఘనంగా నిర్వహించారు.రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఎన్ఎస్ యూఐ జెండా ఎగురవేయడంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను, పోరాటస్ఫూర్తిని ప్రదర్శించారు. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఎన్ఎస్యూఐ ఎప్పుడూ ముందుంటుంది... యువతే దేశ భవిష్యత్తు, వారి అభివృద్ధే మా లక్ష్యం" అని అన్నారు.సాయి ఆధ్వర్యంలో వేడుక విజయవంతంగా జరిగినట్లు



నిర్వాహకులు తెలిపారు.రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ సందర్భంగా విద్యార్థుల నినాదాలతో ప్రాంతం మార్మోగింది.ఈకార్యక్రమంలో ఎన్ఎస్యూఐ నాయకులు సాయి, దీపక్, సాయికిరణ్, దత్తు, వర్షిత్, శ్రీకాంత్, మనోజ్,సీనియర్ కాంగ్రెస్ నేతలు బెస్త భాస్కర్, కేబుల్ అశోక్,యువజన కాంగ్రెస్ నాయకులు ఎండీ షకీల్, ఎండీ నయీమ్, సూరి, ఐకాన్ మధు,



ఎండీ జాంగిర్, ఎండీ వాజీద్, ఎండీ మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ. ఆధ్వర్యంలో రేగా కాంతారావు జన్మదిన వేడుకలు

**అన్న దానం కార్యక్రమం నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు**



**సుజాతనగర్ జనసంఘర్షణ :**

బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పినపాక మాజీ శాసనసభ్యుడు,అభివృద్ధి ప్రదాత బడుగు



బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజలు మెచ్చిన ప్రజా నాయకుడు ప్రజల ఆపద్బాంధవుడు అన్నా అంటే నేనున్నాను అని ముందుండే లీడర్ రేగా కాంతారావు, జన్మదిన సందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రేగా కాంతారావు, కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో



బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్, సీనియర్ నాయకులు చెల్ల రవి, మండే పూర్ణచంద్రరావు, అమన్ రాజేష్, గూని నరసింహారావు, బూరుగు భార్గవ్, మండే నరసింహారావు, చెల్లి నాని, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వివాహ మహోత్సవానికి కేటీఆర్ ను ఆహ్వానించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి జనసంఘర్షణ :**

ప్రముఖుల సమక్షంలో వినయ్-శృతి వివాహానికి ఆహ్వానం హైదరాబాద్లోని రాజకీయ వర్గాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న ఒక శుభకార్యానికి ఆహ్వాన కార్యక్రమం ఘనంగా జరిగింది. కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోదరుడు రాజేశ్వరరావు ద్వితీయ కుమారుడు వినయ్ -- శృతి వివాహ వేడుకకు ప్రముఖ నాయకులను ఆహ్వానిస్తూ మర్యాదపూర్వకంగా కలిసిన ఘటన ఆసక్తికరంగా నిలిచింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు కే.టి.రామారావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వివాహానికి ఆహ్వానించారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కూడా పాల్గొని, నూతన దంపతులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ఆశీస్సులతో జరగనున్న ఈ వివాహం రాజకీయ, సామాజిక వర్గాల్లో విశేష ఆకర్షణగా నిలవనుంది.

జన సంఘర్షణ
శుక్రవారం
10 ఏప్రిల్ 2026

# కూకట్పల్లిలో డిగ్రీ విద్యార్థులకు ఆధునిక భవనం ప్రారంభం

**-విద్యతోనే జీవిత మార్పు**

**- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్**




**కూకట్ పల్లి జనసంఘర్షణ**
కూకట్ పల్లి నియోజక వర్గంలో విద్యాభివృ ద్ధికి మరో కీలక ముందడుగు పడింది. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మరియు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ కలిసి రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితర ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "చదువు ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చగల శక్తివంతమైన సాధనం" అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే కళాశాలలో పెరుగుతున్న విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, అదనపు గదుల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని, కొత్త కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం మరియు నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ల్యాప్టాప్లు, అంగన్వాడీ టీచర్లకు సెల్ఫోన్లు పంపిణీ చేసి వారి పనితీరును మరింత సులభతరం చేసే దిశగా ముందడుగు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కూకట్ పల్లి విద్యాభివృద్ధికి ఈ నూతన భవనం ఒక మైలురాయిగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# విద్యుత్ కార్మికుల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె కొనసాగింపు

**రెండో రోజు కూడా 100% హాజరుతో ఉద్యమం ఉధృతం**



**కూకట్పల్లి జనసంఘర్షణ:**
విద్యుత్ కార్మికుల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకొని ఉధృతంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోని అన్ని డివిజన్లలో కార్మికులు భారీ సంఖ్యలో సమ్మెలో పాల్గొంటూ తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రస్తుత విద్యుత్ మంత్రి బట్టి విక్రమార్క పాదయాత్ర సమయంలో తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పలు మార్లు ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, సంస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను విస్మరించడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల్లో 100 శాతం మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రధాన డిమాండ్లు: ఆర్టిసన్లకు వారి విద్యార్హతల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలి, ఆర్టిసన్లకు APSEB రూల్స్ అమలు చేయాలి, మీటర్ రీడర్ కార్మికులకు జి ఒ No. 11 వెంటనే అమలు చేయాలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రామవరంకు యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరా చేపట్టాలి

- మిషన్ భగీరథ పనుల పట్ల అధికారులు అలసత్వాన్ని వీడాలి
- తక్షణమే నూతన ట్యాంకును వినియోగంలోకి తేవాలి
- స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసి
- నీటి ఎద్దడిని నివారించాలి
- పైప్లైన్ నిర్మాణాలవల్ల దెబ్బతిన్న రోడ్లకు
- మరమ్మతులు చేపట్టాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.షాబీర్ పాషా



**కొత్తగూడెం జనసంఘర్షణ:**
రామవరం ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన మంచినీళు అందించాలని, ప్రజల దాహార్తిని తీర్చడంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షాబీర్ పాషా డిమాండ్ చేశారు. గురువారం ఉదయం రామవరంలోని కిన్నెరసాని, మిషన్ భగీరథ పైప్లైన్ పనులను, నూతన ట్యాంకులను సిపిఐ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రూ. 125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించి, ప్రజలకు నీటి కష్టాలు తీర్చాలని కృతనిశ్చయంతో ఉంటే, అధికారుల అలసత్వం వల్ల పనులు జాప్యం అవుతున్నాయని మండిపడ్డారు. తక్షణమే పనులు పూర్తి చేసి నూతన ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయాలని, ఈ విషయమై ఎమ్మెల్యే ఇప్పటికే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా సాయంత్రానికి నీళ్లు అందించాలని, అవాంతరాలు కలగకుండా స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పైప్లైన్ల కోసం తవ్విన శిథిలమైన రోడ్లను వెంటనే మరమ్మత్తు చేసి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలని ఆయన అధికారులను కోరారు. ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, కార్పొరేటర్లు సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, నాయకులు మర్రి గోపి, యూసుఫ్, మాటేటి గోపాల్, నగేష్, రమేష్, అంకుష్, గంటాడి కోటేశ్వరరావు, దుర్గయ్య, నాగరాజు, శివ, రాజు, జగ్గు, చందు తదితరులు ఉన్నారు.

# ములకలపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె










**అశ్వరావుపేట జనసంఘర్షణ:**
ములకలపల్లి మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, విస్తృతంగా పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ముందుగా రామచంద్రాపురం చాపరాలపల్లి గ్రామాల్లో ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు తెలిపారు. అనంతరం పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కుమ్మరిపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి గుట్టగూడెం గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం నిర్వహించారు. అలాగే డ్వాక్రా మహిళల కోసం సమావేశ మందిరం (వీవో బిల్డింగ్) నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. మాదారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తరువాత ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మండల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు. పర్యటనలో భాగంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పలువురిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల అధికారులు ముఖ్య నాయకులు సర్పంచులు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన నామినీలకు చెక్కుల అందజేత





**సిద్దిపేట జనసంఘర్షణ:**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట, బల్వం తపూర్ గ్రామాలకు చెందిన ఎండి సల్మా బి, సౌదు కమల, అనారోగ్య కారణాల వలన మరణించడం జరిగింది. వీరు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి సామాజిక భద్రత పథకాలు ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన , ప్రధానమంత్రి సురక్ష భీమ యోజన పథకాలలో దుబ్బాక స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా లో భీమా నమోదు చేసుకున్నం దున వారి యొక్క నామినిలకు రెండు లక్షల రూపాయల చెక్కు స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా దుబ్బాక బ్రాంచ్ మేనేజర్ దమయంతి చే ఇప్పించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ సాయి కృష్ణ, ఎస్బిఐ దుబ్బాక బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ యాదగిరి చారి మరియు కేశన్న రామ్ కుమార్, సరోజ్, శ్రీలత , ఆఫ్రిది ,ఎఫ్ఎస్ఓ నరేష్ , మహేష్ మొదలగు వారు పాల్గొనడం జరిగింది

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co